క్లుప్తంగా

నగదు చెల్లిస్తే విద్యుత్ లైన్ మారుస్తాం..

అశ్వాపురం: మండల పరిధిలోని అమెర్ద గ్రామ పంచాయతీలో అమెర్ద కాలనీలో 33/11 కేవీ విద్యుత్ లైన్ మార్పుపై ఏడాదిన్నర క్రితమే డిమాండ్ నోటీస్ ఇచ్చామని, ఆయా ప్రాంతాల్లోని ప్రజలు తగిన నగదు చెల్లిస్తే విద్యుత్ లైన్ మారుస్తామని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు'అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై ఏఈ శ్రీనివాస్ సాక్షితో మాట్లాడుతూ.. ఏడాదిన్నర క్రితం ఇళ్ల మధ్య విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని ఆమెర్ద కాలనీ గ్రామస్తుల వినతి మేరకు 11 కేవీ విద్యుత్ లైన్ మార్పుపై ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు, రూ.3,50,942 ఖర్చు అవుతుందని డిమాండ్ నోటీస్ ఇచ్చినట్లు తెలిపారు. ప్రజల తరుపున గత ఎమ్మెల్యే డబ్బులు చెల్లిస్తామని ముందుకొచ్చినట్లు, కాని ఇప్పటి వరకు చెల్లించలేదని వెల్లడించారు. విద్యుత్ తీగల సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని విద్యుత్ లైన్ మార్పుకు సంబంధించి డబ్బులు ప్రభుత్వం నుంచి చెల్లించేలా చూడాలని అమెర్ద కాలనీ వాసులు కోరుతున్నారు.

బోరు పనులు షురూ



డబుల్ బెడ్‌రూం కాలనీలో బోరు వేస్తున్న సిబ్బంది..

ములకలపల్లి: మండలంలోని మొగరాలగుప్ప శివారు డబుల్ బెడ్‌రూం కాలనీలో బోరు ఏర్పాటు పనులు మొదలయ్యాయి. కాలనీవాసులకు తాగు నీరందించే బోరు పూడిపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయమై అందిన సమాచారంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ తిరుమలేశ, డీఈ సలీం, ఎంపీఓ లక్ష్మయ్య గ్రామాన్ని సందర్శించగా.. గ్రామస్తులు సైతం ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు సమస్యను వివరించారు. దీంతో ఎమ్మెల్యే సూచన మేరకు అధికారులు బుధవారం బోరు నిర్మాణ పనులు ఆరంభించారు. ఈ మేరకు కోండ్రు ప్రసాద్, పొట్టా రమేశ్, కీసరి బాబూరావు, మడకం వినోద్, గుండి వెంకటేశ్, కీసరి ప్రసాద్, సోయం సర్వేశ్వరరావు, కొర్సా రాధ, దుర్గా, సుమలత, సుజాత తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

ములకలపల్లి: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్‌కె.ఉమర్, జిల్లా సహాయ కార్యదర్శి కుంజా కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధిలో నెలకొన్న సమస్యల గుర్తింపుకై సంఘం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ భారతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పని ప్రదేశాల్లో షామియానాలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. డివిజన్ నాయకులు సత్యనారాయణ, మండల నాయకులు వంకా సురేశ్, దుబ్బా వెంకటేశ్వర్లు, పవళ్ల ఆదినారాయణ, ముదిగొండ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకులు ఎస్‌కె.ఉమర్ డిమాండ్ చేశారు. సంఘ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ మండల నాయకులు వరికూటి వెంకట్రావు, భీముడు, సోయం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అన్నపురెడ్డిపల్లి: అకాలంగా కురుస్తున్న వర్షాలు, వాతావరణంలోని మార్పు కారణంగా వ్యాప్తి చెందే వ్యాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నీటి కలుషితం, దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. వర్షాకాల నేపథ్యంలో కాచి, చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని,వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా జ్వరంతో బాధపడుతున్న వారు ఉంటే సమీపంలోని ఆరోగ్య ఉప కేంద్రాలలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుతలను సంప్రదించాలని అన్నారు. డయేరియా, కలరా, జ్వరాలు వంటి వ్యాధులు ఉంటే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని ఆమె కోరారు.

ఉక్కపోత.. చిన్నారుల వెత

- అంగన్‌వాడీ కేంద్రాల్లో తగ్గిన హాజరు
- ఎండలకు చిన్నారులను పంపేందుకు తల్లిదండ్రుల విముఖత
- అదనపు బాధ్యతలతో టీచర్ల సతమతం



అంగన్‌వాడీ సెంటర్‌లో ఆడుకుంటున్న చిన్నారులు..

భద్రాచలంఅర్బన్: అంగన్వాడీ కేంద్రాల్లో ఆట పాటలతో కూడిన విద్యాబోధనతోపాటు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. ఆర్థికపరంగా ఇబ్బంది పడే కుటుంబాల్లోని చిన్నారులకు కేంద్రాల్లో అందించే ఒకపూట పౌష్టికాహారం కొండంత అండ. అలాంటి కేంద్రాల్లో వేసవిలో పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు. ఎండలకు తగినట్టుగా భవనాల్లో గాలి, వెలుతురు లేకపోవడంతో చిన్నారలను పంపించడం లేదు. ఫలితంగా పిల్లల హాజరుశాతం గణనీయంగా తగ్గింది.

దుమ్ముగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 173 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. 3 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులు 2401 మంది, గర్భిణులు 675 మంది, బాలింతలు 558 మంది వరకు ఉన్నారు. కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు పోషకాహారం అందించడంతోపాటు చదువు నేర్పిస్తున్నారు. ఆరోగ్యలక్ష్మి పథకం పేరుతో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నారు. గాలి, వెలుతురు సైతం సరిగారాక చిన్నారులు వేసవి ప్రారంభం నుంచి ఉక్కపోతతో అల్లాడుతున్నారు. మధ్యాహ్న భోజనం చేసేందుకు వచ్చే గర్భిణులు, బాలింతలు ఉక్కపోతతో తినలేకపోతున్నారు.



తగ్గుతున్న హాజరు..

అంగన్‌వాడీ కేంద్రాలను ఒంటిపూట నిర్వహిస్తున్నప్పటికీ ఎండ వేడిమితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉక్కపోతతో చాలా మంది చిన్నారులు, గర్భిణులు, బాలింతలు కేంద్రాలకు రావడం లేదు. పౌష్టికాహారం, భోజనం అందిస్తున్నా.. అంతగా ఆసక్తి చూపడం లేదు. ఎండ తీవ్రత నేపథ్యంలో పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చినట్లు అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ఇచ్చి, పోషకాహారం ఇంటికి అందించేలా చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కేంద్రాల్లో విద్యుత్తు సౌకర్యంతోపాటు ఫ్యాన్లు, వెలుతురుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని ఆ పరిధిలో గల లబ్ధిదారులు కోరుతున్నారు. దుమముగూడెం ఐసీడీఎస్ పరిధిలో 173 కేంద్రాలు ఉండగా వాటిలో 100 కేంద్రాలు ప్రభుత్వం భవనాలు కాగా, 73 కేంద్రాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. వీటిలో కేవలం రెండు కేంద్రాలకు మాత్రమే విద్యుత్ సదుపాయం కలదు. దీంతో అంగన్‌వాడీకి వచ్చే చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు ఉక్కపోతతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే దీనిపై అధికారులు చర్యలు తీసుకుంటామని సమాధానం ఇస్తున్నారు, కానీ అలాంటి చర్యలు ఎక్కడా కూడా కనిపించడం లేదు.

టీచర్లకు అదనపు బాధ్యతలు..

అంగన్‌వాడీ టీచర్లకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఇటు అంగన్‌వాడీలో పిల్లలకు సరైన సమయాన్ని కేటాయించడంలో విఫలం అవుతున్నారు. ఎన్నికల విధుల్లో భాగంగా బీఎల్‌వో లు విధులు నిర్వహిస్తూ, ఇంటింటికి వెళ్లి ఓటరు స్లిప్పులు పంపిణీ, ఓటరు అవగాహన కార్యక్రమాలు ఇతర పనుల నిమిత్తం ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లను ఉపయోగిస్తుండడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లలకు చదువు చెప్పేందుకు గాని, పిల్లలతో తమ సమయాన్ని గడిపేందుకు కూడా సమయం ఉండడం లేదు. దీంతో టీచర్లు సతమతం అవుతున్నారు. టీచర్లే అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేని పరిస్థితి ఉంటే మరి పిల్లలు ఎలా వస్తారు అంటూ పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు.

వేసవి ప్రభావంతో తగ్గారు..



వేసవి ప్రభావంతో కేంద్రాల్లో పిల్లల హాజరుశాతం తగ్గింది. కేంద్రాల్లో వేడి వాతావరణం అందుకు ఒక కారణం. అనుమతి లేకుండా ఫ్యాన్లు ఏర్పాటు చేసే పరిస్థితి లేదు. సాక్ష్యం పథకంలో భాగంగా కేంద్రాల్లో మౌలిక వసతుల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. రానున్న రోజుల్లో కేంద్రాలలో మరిన్ని సదుపాయాలు కల్పించి , పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకుంటాం. అంగన్‌వాడీ టీచర్లకు అదనపు బాధ్యతలు అనే విషయం ప్రభుత్వం చేతుల్లో ఉంది.

– నవ్యశ్రీ, సీడీపీఓ, దుమ్ముగూడెం ప్రాజెక్టు

కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి



దుమ్ముగూడెం: సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

దుమ్ముగూడెం: విద్యావంతుడు, మేధావి అయిన బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డిని పట్టభద్రులు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని, ఇందుకోసం కార్యకర్తలు కష్టపడి పని చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపునిచ్చారు. బుధవారం లక్ష్మీనగరం గ్రామంలోని పార్టీ కార్యాలయంలో ఎన్నికల సన్నాహక సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో అమలు కానీ వాగ్దానాలతో గద్దె ఎక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయలేక కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ప్రజలను చైతన్య పరచి ఎన్నిక వాగ్దానాలను అమలుచేసే విధంగా పోరాడాలని కోరారు. గత ఎన్నికల్లో ఈ మండలంలో అత్యధిక మెజారిటీ ఇచ్చిన ప్రజలకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. విద్యావంతుడు, మేధావి, నిరుద్యోగుల సమస్యలు పట్ల పూర్తి అవగాహన ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి రాకేష్ రెడ్డిని అత్యంత మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు మానే రామకృష్ణ, రావులపల్లి రాం ప్రసాద్, మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణ మూర్తి, కార్యదర్శి కణితి రాముడు, ఎంపీపీ రేసు లక్ష్మి, నాయకులు జానీ పాషా, తునికి కామేష్, మాజీ సర్పంచ్‌లు సోడి జ్యోతి, సీతారాం సరియం, భూక్యా చందు, సొసైటీ డైరెక్టర్ బొల్లి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మెచ్చా ఆధ్వర్యంలో సమావేశం..

అన్నపురెడ్డిపల్లి: బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులను మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కోరారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రగుంట గ్రామంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకైనా రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్, వైఎస్ ఎంపీపీ మామిళ్లపల్లి రామారావు,నాయకులు వీరబోయిన వెంకటేశ్వర్లు, కొత్తూరి వెంకటేశ్వర్లు, గోపీనాథ్, పుల్లారావు, రాంబాబు,అప్పారావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్–2024 పరీక్ష కోసం ఏర్పాట్లు పూర్తి చేసిన్నట్లు భద్రాచలం కోఆర్డినేటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జాన్ మిల్టన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24న జరిగే పరీక్షకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, ఈ పరీక్షా కేంద్రాలలో 670 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు అవుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రాలలోకి అనుమతించడం జరుగుతుందని, విద్యార్థులు హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్నులు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఒక నిమిషం నిబంధన అమల్లో ఉన్నందున ఉదయం 11 గంటలు అనంతరం ఏ విద్యార్థిని పరీక్షా హాలుకు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. హాల్ టికెట్ పైన ఫోటో లేని విద్యార్థులు పరీక్షా కేంద్రానికి ముందుగానే చేరుకొని పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో ఆధార్ కార్డు తెచ్చుకొని కళాశాల ప్రిన్సిపాల్‌ని సంప్రదించాలని సూచించారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్ ఫోన్లతో పాటు హాల్ టికెట్లో సూచించిన ఇతర నిషేధిత వస్తువులు పరీక్ష హాల్లోకి అనుమతి లేదని వివరించారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే పాయంకు వినతిపత్రం అందజేస్తున్న సిల్ట్ కాంట్రాక్ట్ కార్మికులు

మణుగూరురూరల్: పీకేఓసీ వాషింగ్ ప్లాంట్ సిల్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు సిల్ట్ కాంట్రాక్ట్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.కృష్ణంరాజు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లగా భారీ యంత్రాల బురదమట్టి(సిల్ట్)ను తొలగించేందుకు కాంట్రాక్ట్ పద్ధతిన అనేకమంది పని చేస్తున్నారన్నారు. వీరికి సెంట్రల్ జీవో ప్రకారం కనీస వేతనం, సంక్షేమం అమలు చేయాలని కోరారు. వీటితో పాటు సీఎంపీఎఫ్, బీమా వంటి సౌకర్యాలను కల్పించేందుకు యాజమాన్యం చొరవ తీసుకోవాలన్నారు. ఆయా సమస్యలపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సింగరేణి యాజమాన్యంపై మాట్లాడి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు ఎస్.గట్టయ్య, ఎస్.రాములు, ఎంపీటీసీ జి.కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు గణేష్‌రెడ్డి, తరుణ్‌రెడ్డి, సిల్ట్ కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చోరీ సామగ్రి రికవరీ చేయాలి

మణుగూరుటౌన్: మణుగూరు 100 పడకల ఆస్పత్రిలో చోరీకి గురైన విలువైన సామగ్రిని రికవరీ చేసి దొంగలపై చర్యలు తీసుకోవడంతో పాటు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీషకు ఇఫ్టూ నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మణుగూరు ఆస్పత్రిలో దాతలు ఇచ్చిన వస్తువులు చోరీకి గురయ్యాయని వీటిపై విచారణ నిర్వహించి సామగ్రి రికవరీ చేయడంతో పాటు దోషులు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుని దాతలు భరోసా కల్పించాలని కోరారు. అదే విధంగా కాంట్రాక్ట్ కార్మికులకు పీఎఫ్ జమ భీమా పథకం వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ప్రగతిశీల మహిళా సంఘం మణుగూరు డివిజన్ కార్యదర్శి రాపర్తి లక్ష్మి, ఉప్పల శివరామకృష్ణ, పెనుగొండ నాగార్జున, సాధనపల్లి రవి తదితరులు ఉన్నారు.

ముగిసిన పోలేరమ్మ జాతర

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం కాలనీ పోలేరమ్మ తల్లి ఆలయంలో వద్ద జరుగుతున్న జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. జాతర ముగింపు సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు మూడు వేల మంది భక్తులు హాజరై అమ్మవారికి పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు.

అయోధ్యకు పరామర్శ

అశ్వాపురం: అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్యాచారిని మణుగూరులో ఆయన నివాసంలో సీపీఐ అశ్వాపురం మండల నాయకులు బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, సీపీఐ నాయకులు కమటం సురేష్, దంతాల జగదీష్, సురేందర్‌రెడ్డి, రాయపూడి రాజేష్, పవన్‌సాయి, నాగేంద్రబాబు, కమటం వీరన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయం

దమ్మపేట: మండల పరిధిలోని అంకంపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నేడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ శాఖ ఏడీఈ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంకపాలెం సబ్‌స్టేషన్‌లో అదనపు యంత్ర సామగ్రిని అమర్చే నిమిత్తం, సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం ఉంటుందని వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు ఇట్టి విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

నృసింహాలయంలో ధ్వజారోహణం

భద్రాచలం: భద్రాచలం సీతారామ చంద్రస్వామి దేవస్థానం అనుబంధంగా ఉన్న లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో బుధవారం ధ్వజారోహణం వైభవంగా జరిగింది. స్వామి వారి కల్యాణ తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా తొలుత ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఉత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం కళ్యాణోత్సవం జరగనుంది. అదేవిధంగా శుక్రవారం సాయంత్రం 6గంటలకు రథోత్సవంను నిర్వహించనున్నారు. ఈ పూజల్లో రామాలయ ప్రధాన అర్చకులు విజయరాఘవన్, అర్చకులు, పండితులు, భక్తులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు విన్నపం

దమ్మపేట: లారీల్లో బొగ్గు లోడింగ్‌ల విషయంలో సత్తుపల్లి సింగరేణి యాజమాన్యం అనుసరిస్తున్న విధానాల వలన కలుగుతున్న ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. సత్తుపల్లి లారీ యూనియన్ సభ్యులు రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు బుధవారం విన్నవించారు. మంత్రి తుమ్మలను ఆయన నివాసం గండుగులపల్లిలో, సత్తుపల్లి లారీ యూనియన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లారీ లోడింగ్‌ల విషయంలో సింగరేణి వారు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను తుమ్మలకు తెలియజేశారు. స్పందించిన తుమ్మల, సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

బకాయిలు చెల్లించాలి

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం రథంగుట్ట వద్ద మిషన్‌భగీరథ వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంటులో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు నాలుగు నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం మిట్టగూడెం రథంగుట్ట వద్ద కార్మికులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఇవ్వాల్సిన రెండు నెలలు, ఇప్పుడు రెండు నెలలు మొత్తం నాలుగు నెలల వేతనాలు కార్మికులకు వెంటనే చెల్లించాలన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత బిల్లులు రావట్లేదని కాంట్రాక్టర్లు చెబుతూ నెలల తరబడి వేతనాలు బకాయిలు పెట్టి కార్మికులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో మిషన్‌భగీరథ సీఐటీయూ నాయకులు పాయం నాగరాజు, సతీష్, లక్ష్మణ్, ప్రభాకర్, విష్ణు, సైదులు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీని గెలిపించండి



అశ్వారావుపేటరూరల్: మాట్లాడుతున్న క్లస్టర్ ఇన్‌చార్జ్ మార్తినేని ధర్మారావు

అశ్వారావుపేటరూరల్: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీజేపీ బలపర్చిన గుజ్జుల ప్రమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఆశీర్వదించాలని ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మార్తినేని ధర్మారావు కోరారు. బుధవారం అశ్వారావుపేటలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శాసన మండలిలో సమస్యలు, పట్టుభద్రుల పక్షాన ప్రశ్నించేది బీజేపీ మాత్రమేనని అన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవీ రమేష్, అసెంబ్లీ కోఆర్డినేటర్ శ్రీకాంత్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్, జల్లిపల్లి అరవింద్, నిరంజన్ దాస్, శ్రావణ్ కుమార్, మద్దాల దేవి పాల్గొన్నారు.

నాయకుల ప్రచారం..

చర్లరూరల్: ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని భద్రాచలం నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎర్రం మహేష్ కోరారు. బుధవారం చర్ల మండలంలోని రైసుపేట కాలనీ, విజయ కాలనీ, పాతచర్ల, గణేశ్ కాలనీ ప్రాంతాలలోని పట్ట భద్రులను కలిసి బీజేపీ కరపత్రాలను పంచుతూ.. మొదటి ప్రాధాన్యత ఓటు బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొలకోటి త్రినాథరావు, కుంజా ధర్మారావు, బిట్రగుంట క్రాంతికుమార్, నక్క కన్నారావు, పుగాకు పూర్ణచందు, ఎడవల్లి శేషగిరి, చింతూరి విశ్వనాథ్, చిడెం జగన్, బందా మధు, శ్రీనివాసచారి, నల్లూరి ఉదయ్, వేణు, తరుణ్ రెడ్డి, రాజా, సురేష్, సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

చెట్లు తొలగించిన యువకులు



రోడ్డుపై పడిన చెట్ల కొమ్మలను తొలగిస్తున్న అంకంపాలెం యువకులు

దమ్మపేట: మండల పరిధిలోని ఆర్లపెంట గ్రామ శివారులో రహదారిపై పడిన పెద్ద చెట్లను అంకంపాలెం గ్రామానికి చెందిన యువకులు తొలగించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మంగళవారం రాత్రి ఆర్లపెంట గ్రామ శివారులోని ఆటవీ ప్రాంతంలో గాలులతో కూడిన వర్ష ప్రభావానికి, భారీ చెట్లు రహదారిపై పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆ ప్రాంతంలో సెల్‌ఫోన్ సిగ్నల్ కూడా లేకపోవడంతో వాహనదారులు బయటకు సమాచారం తెలియజేసే అవకాశం లేక ఇబ్బంది పడ్డారు. అర్ధరాత్రి సమయంలో విషయం తెలుసుకున్న అంకంపాలెం యువకులు రంపాలు, గొడ్డళ్లతో సంఘటనా స్థలానికి చేరుకుని, రోడ్డుపై అడ్డంగా ఉన్న చెట్లను ముక్కలుగా నరికారు. వాటిని రోడ్డుపై నుంచి తొలగించి, వాహనాల రాకపోకలను తిరిగి పునరుద్ధరించారు. కార్యక్రమంలో జారే యువసేన సభ్యులు కాక రమేష్, కూరం నాగేష్, పొట్ట వెంకటరావు, వగ్గెల నవీన్, కొండ్రు సాయి, కూరం జయంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయానికి స్థలం కేటాయించండి



కరకగూడెం: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

కరకగూడెం: మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించి ఆటో యూనియన్ కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరుతూ బుధవారం ఆటో యూనియన్ నాయకులు కరకగూడెం తహసీల్దార్ నాగ ప్రసాదును తహసీల్లో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. 2016వ సంవత్సరంలో ఆటో యూనియన్గా రిజిస్ట్రేషన్ చేయించుకొని ప్రతీ సంవత్సరం రెన్యూవల్ చేసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నడుచుకుంటూ ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటున్నామని, యూనియన్ సమావేశాల నిర్వహణతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌ను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు బాదే సాగర్, ఉపాధ్యక్షుడు రావుల వేణు,సెక్రటరీ ఎలగొండ శ్రీనివాస్, నాయకులు సౌందర్య, చందర్,అనిల్, శివ,మధు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించండి



పట్టభద్రుల ఓట్లు అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

చంద్రుగొండ: పట్టభద్రుల ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మండలకేంద్రంతోపాటు తిప్పనపల్లి, రావికంపాడు, హమ్మద్‌నగర్ గ్రామాల్లో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. పట్టభద్రులకు జీవనభృతి కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ఈ సందర్భంగా ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సాబీర్‌హుస్సేన్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం హమ్మద్‌నగర్‌లో ఇల్లు కాలిపోయిన బాదితుడు బడేసాబ్‌ను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారా వెంకటేశ్వరరావు, మేడా మోహన్‌రావు, వైస్‌ఎంపీపీ నరుకుళ్ల సత్యనారాయణ, సూర వెంకటేశ్వర్లు, సత్తి నాగేశ్వరరావు, భూపతి రమేశ్, నల్లమోతు వెంకట నారాయణ తదితరులు ఉన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని కాలనీల్లో పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ శ్రేణులు బుధవారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ నాయకుడు మానె రామకృష్ణ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున గ్రాడ్యుయేట్ ఓటర్‌లను కలిసి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి ధనేశ్వరరావు ఆకోజు సునీల్ కుమార్, ప్రబోధ్ కుమార్, రేపాక పూర్ణచంద్రరావు, ఉడత రమేష్, శ్రీనివాసరావు, సూరిబాబు, సీతా మహాలక్ష్మి, నరసింహులు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు

మణుగూరురూరల్: ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం విప్పలసింగారం గ్రామపంచాయతీలో విస్తృత ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను జెడ్పీటీసీ పోశం నరసింహారావు, బీఆర్‌ఎస్ నాయకులు కలుసుకుని కరపత్రాలు పంపిణీ చేస్తూ మొదటి ప్రాధాన్యత ఓటును రాకేష్‌రెడ్డికి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.వెంకటరెడ్డి, వీరన్నబాబు, రామారావు, బర్ల సురేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.